# సమాజ విశ్లేషణకు దృక్కోణం

**పోటీ పరీక్షల్లోని వివిధ సబ్జెక్టులపై పట్టు సాధించటం ఎలా సాధ్యమవుతుంది? ఏకాగ్రతతో పుస్తకాల్లో ఉన్న అంశాలను చదివి, కేవలం జ్ఞాపకం ఉంచుకుంటే సరిపోతుందా? లేదు! ఆ అంశాలకు సమాజంతో ఉన్న సంబంధం గుర్తించగలిగే అధ్యయనం అవసరం!**



నూతక్కి విజయశేఖర్

అర్థికశాస్త్రం (ఎకనామిక్స్) చాలా మంది విద్యార్థులకు కొరుకుడు పడదు. ఇది సులభంగా అర్థమయ్యేది కాదని వారు దాని జోలికే పోరు. దీన్ని అంకెలు, లెక్కలు, సిద్ధాంతాలతో నిండివున్న సబ్జెక్టుగా అర్థశాస్త్ర పండితులు మన ముందు ఉంచుతారు.

బోధపడని పదజాలం, వినగానే 'ఇదేదో మామూలుగా అర్థమయ్యేది కాదులా ఉంది' అనిపించే పదవిన్యాసాలూ, వాడుకలో లేని సంస్కృత పదాలూ అందులో ఎక్కువగా కనిపిస్తాయి. దాంతో అది సామాన్యమైన బుర్రకు తేలిగ్గా అర్థమయ్యేది కాదని ఒక నిర్ణయానికి వచ్చేస్తాం. కానీ చదువురాని కోట్లమంది కుటుంబం అనే తమ ఆర్థిక యూనిట్లో జమాఖర్చుల్ని నోటి మాటలతోనే నిర్వహించుకుంటారు. రోజుకు వచ్చే ఆదాయం, ఒక్కో సీజన్‌లో దొరికే పనిదినాలు, ఇంట్లో సంపాదనాపరుల సంఖ్య, వారి తిండి, బట్టలు, వైద్యం మొదలైనవి... వీటన్నింటికీ పథకం ప్రకారం ఖర్చు పెట్టుకుని రోజుకి ఇంత అని వెనకేసుకునే నిరక్షరాస్య కుటుంబాలు దేశంలో పెద్దసంఖ్యలో ఉన్నాయి. అర్థశాస్త్రం అనేది ఒకటుందని తెలియకుండానే వాళ్లంతా పొదుపు చేస్తూ పిల్లల్ని చదివిస్తూ జీవితాలు గడిపేస్తుంటారు. ముఖ్యంగా కుటుంబాల్లో గృహిణులు ప్రతి ఒక్కరూ చిన్నసైజు ఆర్థికవేత్త అయితే తప్ప వారి కుటుంబ నావ సక్రమంగా సాగదు. హాస్టల్‌లో ఉండి చదువుకునే విద్యార్థుల దగ్గర్నుంచి మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి కుటుంబాలు కూడా ఆర్థిక వనరులను దివ్యంగా నిర్వహించుకుంటాయి.

## అంతుబట్టనిది కాదు

ఈ కోణంలో నుంచి చూస్తే అర్థశాస్త్రం అంతుబట్టని విషయమేమీ కాదని అర్థం చేసుకోవచ్చు. పనిచేసి వేతనం సంపాదించడం, అందులో కొంతభాగాన్ని ఖర్చులకు గడుపుకోవడం, మిగిలింది భవిష్యత్తు కోసం పొదుపు చేసుకోవడం... సూక్ష్మ పరిశీలనలో ఒక సాధారణ సంపాదనపరుడి కుటుంబ ఆర్థిక వ్యవస్థ ఇదే. ఈ చిన్న ఆర్థికవ్యవస్థ నిజానికి అతని మనుగడ కూడా.

అంటే ఆర్థిక నిర్వహణ ప్రతి మనిషికీ రోజువారీ మనుగడలో విడదీయరాని అంతర్భాగం. ఈ అవగాహనలో ఇంకొంచెం ముందుకు వెళితే అర్థశాస్త్రం మనుషుల మనుగడలోని ఆర్థిక కోణాన్ని వివరించే శాస్త్రం అని కూడా అర్థం చేసుకోవచ్చు. విడివిడి మనుషుల, కుటుంబాల సమూహమే సమాజం. కాబట్టి సమాజపు ఆర్థిక మనుగడను వివరించేదే అర్థశాస్త్రం. ఈ కోణంలోంచి చూస్తూ అర్థశాస్త్ర సిద్ధాంతాల్ని తేటపరచుకోవడం ప్రారంభిస్తే 'ఓస్.. ఇంతేనా' అనుకునేక్షణాలు మునుముందు ఉన్నట్లే!

అధ్యయనం 7

## పరస్పర ఆధారితాలు

శ్రామికులు, దిగువ, ఎగువ మధ్యతరగతి, ఉన్నత తరగతి, ధనికులు.. ఇలా ప్రతి తరగతి వ్యక్తికీ ఆర్థిక వ్యవస్థలు ఉంటాయి. ఇక్కడ గమనించాల్సింది- ఈ ఆర్థిక వ్యవస్థలు వేటికవే స్వతంత్రం కావు. అవన్నీ పరస్పర ఆధారితాలు. ఉదాహరణకు పాచి పనిచేసుకునే మహిళకు తన పని తన సంపాదన (జమ) అయితే, అదే సంపాదన ఒక మధ్య తరగతి ఇంట్లో ఖర్చు అవుతుంది. పాచి పని వేతనం పెంచి ఇవ్వడం మధ్యతరగతి కుటుంబానికి మహా కష్టం. ధనిక తరగతికి ఒక విధానంలో భాగం. కంపెనీలు, ప్రభుత్వాలు లాంటి వ్యవస్థల్లో ఇవి మనకి కాలపరిమితితో కూడిన ఇంక్రిమెంటు, కాన్ఫిడెన్షియల్ రిపోర్టు తదితర సూత్రబద్ధ విధానాలుగా కనిపిస్తాయి.

కుటుంబానికి ఆర్థిక వ్యవస్థ ఉన్నట్లే కంపెనీకి ఆర్థికవ్యవస్థ ఉంటుంది. చివరికి ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థా అదే రీతిలో ఉంటుందని స్థూలంగా చెప్పుకోవచ్చు.



కుటుంబ ఆర్థిక వ్యవస్థల నిర్వహణ నోటి మాట, ఆలోచన, కాసిన్ని లెక్కలతో గడిచిపోతే కంపెనీల, ప్రభుత్వాల ఆర్థిక నిర్వహణలను విధానాల ఆలంబనగా నిర్వహిస్తారు. ప్రభుత్వాల నిర్వహణ రాజకీయ పార్టీలు చేస్తాయి. కాబట్టి ప్రభుత్వాలు నిర్వహించే ఆర్థిక వ్యవస్థల తీరుతెన్నులను రాజకీయార్థిక శాస్త్రం అని ఎందుకు అనగూడదు? నిజానికి అలాగే అంటారు.

రచయిత 'జాతీయ అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ' సైట్ *www.teluguvartalu.com* నిర్వాహకులు.

## నియమాల సమాహారం

ఆర్థికశాస్త్రం మనుషుల సామాజిక జీవనాన్ని ఆర్థిక కోణంలో పరిశీలిస్తుంది. కాబట్టి అది సామాజికార్థిక శాస్త్రం కూడా. ఆధునిక సమాజాల్లో ఆర్థిక వ్యవస్థల నిర్వహణ కోసం రాజకీయ పార్టీలు ఉనికిలోకి వచ్చాయి. ఈ రాజకీయ పార్టీలు ఒకప్పటి రాచరికాలకు మారురూపం. సమాజ ఆర్థిక నిర్వహణ రాజుల దృష్టి కోణంలో రాజ్య నిర్వహణ. రాజ్య నిర్వహణకు ప్రస్తుత రూపం రాజకీయ నిర్వహణ. కాబట్టి సమాజాల ఆర్థిక నిర్వహణ రాజకీయాలతో ముడిపడి ఉన్న రాజకీయార్థిక నిర్వహణ. ఈ నియమాల సమాహారమే రాజకీయార్థిక శాస్త్రం. ఆర్థికశాస్త్రం అనకుండా రాజకీయార్థశాస్త్రం అనడం ఎందుకంటే- ఆర్థిక శాస్త్రం కేవలం ఆర్థికశాస్త్రంగా చూసినంతవరకూ అదొక కొరుకుడు పడని విషయం. కానీ ఆర్థికశాస్త్రం స్వయంభువు కాదు. ఆ మాటకొస్తే ఏ శాస్త్రమూ కాదు.

## ఊహాత్మక విభజన

సామాజిక ఆచరణలోని అనుభవాలను క్రమపద్ధతిలో పేర్చగలిగితే అది శాస్త్రమవుతుంది. సామాజిక ఆచరణల అనుభవాల దొంతరలను సులభంగా అధ్యయనం చేయడానికి వివిధ విభాగాలుగా విడగొట్టుకుని వివిధ పేర్లు పెట్టుకున్నాం. ఆ విధంగా మాత్రమే అర్థశాస్త్రం నుంచి రాజకీయశాస్త్రం, సామాజిక శాస్త్రం, జనాభాశాస్త్రం, తదితర మానవ శాస్త్రాలు విడిపోయాయి. వాస్తవంలో మానవ సమాజ మనుగడ ఈ శాస్త్రాలన్నీ కలిపిన ఒక ముద్ద. కాసింత కూర, కొద్దిగా నెయ్యి, అన్నం కలిపితే ముద్ద అయినట్లే మానవ శాస్త్రాల ముద్ద మన సామాజిక ఆచరణ. అధ్యయనం కోసం మనం ఊహాత్మకంగా వీటిని విడదీసుకున్నాం.

ఆ విధంగా అర్థ/ ఆర్థికశాస్త్రం సమాజ మనుగడతోనూ, ఆ మనుగడను శాసించే రాజకీయాలతోనూ ముడిపడివుంది. కాబట్టి ఆర్థిక అంశాలను ఉన్నది ఉన్నట్లుగా సామాజిక, రాజకీయ సంబంధాలతో ముడిపడివున్న విషయంగా చూడడం ప్రారంభిస్తే ఇక దాన్ని మించిన ఆసక్తికరమైన అంశం మరొకటి ఉండదు. దానిని ఆంగ్లంలో 'పొలిటికల్ ఎకానమీ' అంటారు. ఇది పాఠ్యగ్రంథాల్లో లభ్యమయ్యే సబ్జెక్టు కాదు. మానవ పరిణామ క్రమాన్ని ఆయా వ్యవస్థల పరిణామక్రమంతో పాటుగా బోధించే పుస్తకాల్లో ఇలాంటి వివరణ లభిస్తుంది.